క్లుప్తంగా

నేడు శిల్పారామంలో ప్రత్యేక ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కళావేదికపై ప్రత్యేక నృత్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక డ్యాన్స్ మాస్టర్ విజయశాంతి బృందం నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నారని , ప్రముఖ టీవీనటి శ్రీయుక్త, యాంకర్ అమూల్య కార్యక్రమానికి విచ్చేయనున్నట్లు తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం


అబ్దుల్ రజాక్

కడప రూరల్: కడప నగరం నిర్మల స్కూల్ ప్రాంతంలో ఆయుర్వేద వైద్య విధానం ద్వారా చికిత్సను అందిస్తున్న డాక్టర్ అబ్దుల్ రజాక్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. ఈయన నడుము నొప్పులు, మోకాళ్ళ నొప్పులు ఇతర సమస్యలతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు హోమియోపతి వైద్య విధానం ద్వారా చికిత్స అందిస్తున్నారు. ఈయన సేవలకు గుర్తుగా తమిళనాడులోని హోసూర్ ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు ఇటీవల గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేశారు. గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల డాక్టర్ అబ్దుల్ రజాక్ సంతోషం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావిద్

కడప ఎడ్యుకేషన్: వాహనాలను నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి ప్రమాదాలను అరికట్టాలని కడప ట్రాఫిక్ సీఐ జావిద్ పేర్కొన్నారు. శనివారం కడప మారుతినగర్‌లోని నాగార్జున హైస్కూల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోని అండర్ ఏజ్ విద్యార్థులు ఎవరు కూడా వాహనాలను నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు వాహనాలను ఇవ్వవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ తులశమ్మ, హెడ్‌మాస్టర్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకోవాలి


భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే మాధవీ రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి పేర్కొన్నారు. కడప ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ నూర్జహాన్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ గైడెన్స్ మానిటరింగ్ ఆఫీసర్ హబీబుల్లా, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ చెప్పలి రాజారావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఆపన్నహస్తం వన్ స్టాప్ సెంటర్


వన్‌స్టాప్ సెంటర్‌లో హాజరు పట్టీని పరిశీలిస్తున్న న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆపదలో ఉన్న బాధిత మహిళలకు కడపలోని వన్‌స్టాప్ సెంటర్ ఆపన్నహస్తం అందిస్తూ అక్కున చేర్చుకుంటోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. శనివారం జడ్జి బాబా ఫక్రుద్దీన్ స్థానిక వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. తొలుత ఆయన ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. బాధిత మహిళలకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగుల హెల్ప్ లైన్ నెంబర్ 14456 గురించి వివరించారు.

మొదలైన సంక్రాంతి సందడి

కడప కల్చరల్: కడప నగరంలో సంక్రాంతి సందడి మొదలైంది. పండుగకు వారం రోజుల సమయం ఉన్నా కొన్ని వీధుల్లో గంగిరెద్దుల సందడి కనిపిస్తోంది. సరిగ్గా తెల్లవారక ముందే గంగిరెద్దు ఆటలు వీధి వాసులను ఆకర్షిస్తున్నాయి. సన్నాయి పాటలు, గంగిరెద్దుల మెడల్లో గంటల శబ్దం వినిపించకగానే ఇండ్లలోని మహిళలు పాత దుస్తులు, డబ్బు, బియ్యం అందజేసి గంగిరెద్దును బసవయ్య, గోమాతను గోమాలక్ష్మీగా భావించి పూజలు చేస్తున్నారు. ఈ సందడితో నగరానికి వారం ముందే సంక్రాంతి సందడి వచ్చినట్టు భావిస్తున్నారు.

ధనుర్మాసం మొదలైన నాటి నుంచి ఇండ్ల ముంగిళ్లలో రంగుల కళ కనిపిస్తోంది. ఇంద్ర ధనస్సును తలపిస్తూ ముగ్గులు కనువిందు చేస్తున్నాయి. మహిళలు, యువతులు తొలి వెలుగులు రాకముందే రంగు రంగుల రంగ వల్లులను తీర్చి దిద్దుతూ తమ కళా ప్రతిభ, సృజనలతో సంక్రాంతికి స్వాగం పలుకుతున్నారు. సంక్రాంతి పండుగకు ప్రత్యేకంగా నాటు కోళ్ల వ్యాపారం కూడా


వీధుల్లో గంగిరెద్దు సందడి


వీధుల్లో రెడ్డెమ్మ తల్లి భక్తుడు

మొదలైంది. కనుమ పండుగ నాడు వంటకం కోసం సంక్రాంతి సంబరాల్లో భాగంగా నాటు కోడి పుంజుకు మంచి డిమాండ్ కనిపిస్తోంది. కడప నగరంలోని మాచుపల్లె బస్టాండుతో పాటు మరి కొన్ని చోట్ల గ్రామ వాసులు నాటు కోళ్లను తెచ్చి విక్రయిస్తున్నారు. వారం రోజులుగా ఉదయాన్నే రెడ్డెమ్మ తల్లి భక్తులు వీధుల్లో దేవతా మూర్తుల సంకీర్తనలు చేస్తూ కనిపిస్తున్నారు. గ్రామాలకే పరిమితమైన ఇలాంటి సంప్రదాయాలు ఇటీవల నగరంలో కనిపిస్తుండటం విశేషం. నగర శివార్లలోని ఇందిరానగర్ ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి గంగిరెద్దుల కుటుంబాలు వారు విడిది చేశారు.

చిన్నారుల సృజనశక్తికి ప్రశంసలు


చిన్నారుల ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాష

కడప కల్చరల్ : కడప నగరం బళ్లారిరోడ్డులోని నజ్ముల్అమీన్ పబ్లిక్ స్కూలులో శనివారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. పలువురు విద్యార్థులు 75కు పైగా ఎగ్జిబిట్లను రూపొందించి ప్రదర్శించారు. ప్రధానంగా ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి లోపు విద్యార్థులు సీనియర్లతో పోటీ పడి తమ శక్తి మేరకు విజ్ఞానాన్ని పోగేసుకుని ఆసక్తికరమైన ప్రాజెక్టులను రూపొందించి వీక్షకుల ప్రశంసలు పొందారు. ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌బాష, పాఠశాల సిబ్బంది చిన్నారులను అభినందించారు.

బద్వేలు డిపోను ఆదర్శంగా నిలుపుతాం


డీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్/బద్వేలు : ఏపీఎస్ ఆర్టీసీ బద్వేలు డిపోను అన్ని అంశాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని డిపో మేనేజర్ ఆర్సీ నిరంజన్ తెలిపారు. శనివారం ఆయన డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి డీఎంగా పనిచేసిన కన్యాకుమారి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈమె కడప డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా తిరిగి బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా బద్వేలు డీఎం మాట్లాడుతూ యూనియన్ నాయకులందరితో సమన్వయంగా పనిచేస్తూ డిపోను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు యూనియన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హైందవ శంఖారావానికి ప్రత్యేక రైలు


ప్రత్యేక రైలుకు పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విజయవాడ సమీపంలోని ఉప్పలూరు వద్ద జరగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు కడప రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన ఈ రైలు ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, నంద్యాల, గుంటూరు మీదుగా ఉప్పలూరుకు చేరుకోనుంది. అనంతరం బహిరంగసభ ముగిసిన తర్వాత ఆదివారం రాత్రి ఇదే మార్గంలో బయలుదేరి కడపకు చేరుకోనుంది. బీజేపీ నాయకులు ముందుగా రైలు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యదర్శి బాలకృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వెంకటసుబ్బారెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, రైల్వేస్టేషన్ మేనేజర్ శేఖర్, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ నాగభూషణం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంధుల పాలిట దైవం లూయీ బ్రెయిలీ


సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి


లూయీ బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: అంధుల ఆరాధ్యదైవం లూయీ బ్రెయిలీ అని రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి అన్నారు. శనివారం కడప శంకరాపురంలోని ప్రభుత్వ ఆంధుల ఉన్నత పాఠశాలలో జాతీయ అంధుల సమాఖ్య కడపశాఖ ఆధ్వర్యంలో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల ఆవరణంలోని బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంధుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. వైవీయూ వీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నేడు అంధులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం అంధులకు క్రికెట్, షాట్‌పుట్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడలతోపాటు చదరంగం, క్యారమ్స్, మ్యాజిక్, వకృత్వ, బ్రెయిలీ లిపిలో చదవడం, రాయడం వంటి పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్, దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కృష్ణకిషోర్, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ గంగిరెడ్డి, అంధుల పాఠశాల హెచ్‌ఎం ఎబినైజర్ ఇమ్మానియేలు, జాతీయ అంధుల సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కడప కల్చరల్ : ప్రపంచంలోని అంధులకు లిపిని సృష్టించి వారి జీవితాల్లో అక్షర సుమాలను పూయించి జ్ఞాన దీపాలను వెలిగించిన లూయీ బ్రెయిలీ అంధుల పాలిట దేవుడని అంధుల సంఘం అధ్యక్షులు షేక్ కమాల్‌బాష తెలిపారు. ఏపీ వలంటరీ ఆర్గనైజేషన్ ఫర్ పీపుల్స్ రిలీఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్ఫన్ ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ సర్వీస్ సెంటర్‌లో శనివారం లూయీ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కమాల్‌బాష అంధుల ఆరాధ్య దైవమైన బ్రెయిలీ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గోపాల్, వీరేష్, రమణారెడ్డి, ఖాజావల్లీ, కిశోర్, నాగభూషణ్‌రెడ్డి, రసూల్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


జీసీటీఏ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ సురేష్‌బాబు తదితరులు


పెన్షనర్ల సంఘ డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్‌డీఓ జాన్ ఇర్విన్

వైవీయూ: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ ఆవిష్కరించారు. శనివారం కళాశాలలో జీసీటీఏ అధ్యక్షుడు డా. టి. శశికాంత్‌రెడ్డి, కార్యదర్శి డా. సి. నాగేశ్వర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ బండి రామకృష్ణల ఆధ్వర్యంలో జీసీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ , అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఎస్‌యూ ఆధ్వర్యంలో..

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయి దత్త ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను నగర మేయర్ సురేష్ బాబు ఆవిష్కరించారు. శనివారం కడప నగరంలోని అపూర్వ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ పాల్గొని మాట్లాడుతూ వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో మల్టీకలర్ క్యాలెండర్ తీసుకురావడం అభినందనీయమన్నారు. విద్యార్థుల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని విద్యార్థి నాయకులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంచుపాటి బాబు, మూలే సరస్వతి సుశీలమ్మ, తులసమ్మ కళ్యాణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో..

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డైరీ, క్యాలెండర్‌ను శనివారం కడప రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ జాన్ ఇర్విన్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, పెన్షనర్ల సంఘం కోశాధికారి నాగేష్, ఉపాధ్యక్షులు తుపాకుల నారాయణ, శంకరయ్య, ప్రభుదాస్, శ్రీనివాసులు, చలపతి, రాముడు, బహదూర్ అలిషా, మల్లయ్య, రామయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ శివశంకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: క్రీడలతో పిల్లలకు మానసికోల్లాసంతోపాటు శారీరక దృఢత్వం వస్తుందని నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్లు భానేష్ సాయిరెడ్డి, శ్రీదేవి పేర్కొన్నారు. కడప నాగార్జున మోడల్ స్కూల్లో శనివారం స్పోర్ట్స్ స్పెక్ట్రా పేరిట క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు భానేష్ సాయిరెడ్డి జాతీయ పతాకాన్ని, శ్రీదేవి క్రీడా పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో పిల్లలకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరం అన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల పిల్లలకు క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, జవాబుదారీతనం వంటి లక్షణాలు అలవడతాయన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ సమీర, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని ఏఐసీసీ కో–ఆర్డినేటర్ సత్తార్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ , కడప నియోజక వర్గ కో–ఆర్డినేటర్ బండి జకరయ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో 'రాజ్యాంగంపై, అంబేద్కర్‌పై ,మనువాదుల దాడులు ' అనే విషయంపై చర్చా వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ఉక్కు ఐక్యవేదిక నాయకులు నారాయణరెడ్డి, అఖిలపక్ష కన్వీనర్–సి ఆర్ వి ప్రసాద్ , ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శ్రీనివాసులు, బీఎస్పీ నాయకులు గురప్ప, లోక్ సత్తా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టు బదిలీని వెంటనే ఆపాలి


బహిరంగలేఖను చూపుతున్న కాంగ్రెస్ నేతలు

కడప అర్బన్ / కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఫాస్ట్ ట్రాక్ కోర్టు బదిలీని వెంటనే ఆపాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. కడప నగరంలో కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు ఫాస్ట్ ట్రాక్ కోర్టును తిరుపతికి బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 145 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షాశిబిరాన్ని శనివారం కాంగ్రెస్ నేతలు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున ఫాస్ట్ ట్రాక్ కోర్టు బదిలీని వెంటనే ఆపాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు బహిరంగలేఖ విడుదల చేశారు. అనంతరం ఆ లేఖను కడప న్యాయవాద సంఘం అధ్యక్షుడు గుర్రప్పకు అందచేశారు. రిలే దీక్షల్లో న్యాయవాదులు అన్వర్‌బాష, రవి చక్రవర్తి, రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర


పాదయాత్రగా వెళుతున్న గోవిందస్వాములు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన గోవిందమాల భక్తబృంద సేవా సమితి ప్రతినిధులు శనివారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఉదయం స్థానిక తిరుమల తొలిగడప దేవునికడప ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ఇరుముడులు ధరించి పాదయాత్రగా బయలుదేరారు. మాసాపేట మీదుగా మున్సిపల్ హైస్కూలు వద్దగల అన్నమయ్య విగ్రహం వద్ద ఆగి స్వామికి కొబ్బరికాయలు సమర్పించి, హారతులు ఇచ్చి పూజలు నిర్వహించారు. ఒంటిమిట్ట, రాజంపేట, రైల్వేకోడూరు మీదుగా తిరుమలకు వెళుతున్న గోవిందస్వాములు మధ్యలో రెండుచోట్ల విరామం తీసుకుని వైకుంఠ ఏకాదశికి ముందురోజు తిరుమలకు చేరనున్నారు. సరిగ్గా ఆరోజున స్వామి దర్శనం అయ్యేలా వారు బయలుదేరి వెళ్లారు. స్థానిక ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొని యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

కడప కార్పొరేషన్ : జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన కోగటం మునిశేఖర్ రెడ్డి , అలాగే ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన జై చంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలతోపాటు ఇందుకు సహకరించిన జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు , మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషలకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

కడప అర్బన్: గాలివీడు మాజీ ఎంపీపీ, ప్రముఖ న్యాయవాది, వైఎస్‌ఆర్‌సీపీ నేత జల్లా సుదర్శన్ రెడ్డి గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై దాడి చేశారని అక్రమకేసు బనాయించి జైలుకు పంపడం అన్యాయమని వైఎస్‌ఆర్‌సీపీ నేత రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. జల్లా సుదర్శన్‌రెడ్డికి బెయిల్ రావడంతో రిమ్స్ సమీపంలోని విన్యాస్ అపార్ట్‌మెంట్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. జల్లా సుదర్శన్ రెడ్డిని శనివారం రెడ్యెం పరామర్శించి జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు.

అన్నదానం


రిమ్స్ ఆవరణలో అన్నదానం చేస్తున్న శ్రీకాశీ విశ్వనాథ సేవా సమితి సభ్యులు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆవోపా సంస్థ ప్రతినిధులు

కడప అర్బన్: కడప నగరంలోని రవీంద్రనగర్‌కు చెందిన వెన్నపూస కాంతమ్మ తమ కుమారుడు దివంగత వెన్నపూస భాస్కర్‌రెడ్డి జ్ఞాపకార్థం శ్రీ కాశీవిశ్వనాథసేవాసమితి ఆధ్వర్యంలో శనివారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్సకోసం వచ్చిన వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, విజయలక్ష్మి, ఆర్టీసీ రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, రెడ్డి లక్ష్మణ్, వెంకటసురేష్‌బాబు, ఎలక్ట్రిషన్ మధు, అరుణకుమారి, సతీష్, దాత కాంతమ్మ, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కడప కల్చరల్ : ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం అంధుల లిపి నిర్మాత లూయీ బ్రెయిల్ జయంతి సందర్భంగా 350 మందికి అంధుల పాఠశాలలో దాతలు ఉమ, భానుప్రకాశ్, సౌజన్యల సహకారంతో అన్నదానం నిర్వహించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు సాధు కృష్ణవేణి, కార్యదర్శి దశమందం వెంకట సుప్రియ, కోశాధికారి బంగారు రెడ్డిలక్ష్మి, కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. అతిథులుగా ఆవోపా సంస్థ మహిళా విభాగం చీఫ్ కో ఆర్డినేటర్ ఆకుల వెంకట సత్యప్రసాద్, లోకల్ యూనిట్ అధ్యక్షులు సాయిరాం ప్రతాపం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

12 న సెమినార్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పేద, చిన్న సన్నకారు రైతులకు, డ్వాక్రా మహిళలకు, చిన్నచిన్న వ్యాపారులకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రుణాలు ఇస్తున్నదని అలాంటి బ్యాంకును అమరావతికి తరలించకపోతే బ్యాంకు ఖాతాదారులు ఊరుకోరని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏపీజీబీ తరలింపు పై నగర ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన ఐఎంఏ హాల్‌లో ఏపీజీబీ తరలింపుపై ప్రజలలో అవగాహన నింపడం కోసం సెమినార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మక్బూల్ బాషా, కార్యదర్శి వర్గ సభ్యులు మండలం ప్రసాద్, తస్లీమ్, లక్ష్మీదేవి, చాపల సుబ్బరాయుడు, రవి, మునిరెడ్డి, వెంకటేశు, బాల చెన్నయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి మరుగుదొడ్లు


అందుబాటులోకి వచ్చిన మరుగుదొడ్లు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయానికి ముఖ్యమైన సౌకర్యం ఒనగూరింది. నాలుగు నెలల క్రితం ఆలయం దక్షిణ వైపున గల పాత మరుగుదొడ్ల స్థానంలో నగర పాలక సంస్థ నూతన మరుగుదొడ్లను నిర్మించింది. స్థానికుల వినతుల మేరకు అధికారులు స్పందించి ఈ మేరకు సౌకర్యాన్ని కల్పించారు. ఆ తర్వాత దాని గురించి పట్టించుకోకపోవడం, భక్తులకు అందుబాటులోకి తేకపోవడంతో సాక్షి డిసెంబరు 10వ తేదిన 'నిర్మించినా వినియోగించుకోలేం' శీర్షికన కథనం ప్రచురించింది. కనీసం బ్రహ్మోత్సవాల నాటికైనా వీటిని అందుబాటులోకి తేవాలని కోరింది. స్పందించిన అధికారులు ఈనెల 28 నుంచి జరగనున్న కడప రాయుని బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకుని శనివారం మరుగుదొడ్లను అందుబాటులోకి తెచ్చారు. దీనిపై భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.